
# స్వయం కృషి

**- రావిపల్లి నారాయణరావు**

**ప్రమోషన్ మీద బ్రాంచి మేనేజర్‌గా నాకు బదిలీ అయింది. ఆర్డర్స్ అందుకుని కొత్త ఆఫీసులో చేరగానే మనస్సులో చెలరేగే ఆనందం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. హైదరాబాద్ నగరంలో గడచిన అయిదేళ్ళనుండి పనిచేస్తున్న నేను అదే ఊళ్ళో మరో బ్రాంచి ఆఫీసులో చార్జి తీసుకోగానే ఏదో కొత్త ప్రదేశంలో అడుగుపెట్టిన అనుభూతి కలిగింది. ఆఫీసులో పనిచేసే స్టాఫ్ తమనితాము పరిచయం చేసుకుని ప్రమోషన్ మీద వచ్చిన నన్ను అభినందించారు.**

'డ్యూటీ ఫస్ట్'అన్న ధ్యేయంతో అంతా పనిచేయాలని, కష్టపడి పనిచేసే ఉద్యోగులను మేనేజ్‌మెంట్ తప్పక గుర్తించగలదని నేను చెప్పాను. స్టాఫ్ వారి విధులకు వెళ్ళగానే సెక్రటరీ వచ్చి నా ఎదుట నిలబడ్డాడు.





'చెప్పండి రావుగారూ, ఎనీ ప్రాబ్లమ్?' అడిగాను నేను.

'అలాంటిదేమీ లేదు మేడమ్,... సెక్యూరిటీ గార్డు పోస్టులకు ఈరోజే ఇంటర్వ్యూ. మెయిన్ హాల్లోకి తమరు దయచేయాలి' అతను చెప్పాడు.

ఇంటర్వ్యూ టైమ్ అడిగి తెలుసుకున్నాను.

అయిదేళ్ళలో బ్రాంచి మేనేజర్‌గా ప్రమోషన్ పొందటం సాధారణంగా జరగని పని. స్వల్ప వ్యవధిలో ఆ పదవి లభించటం నా అదృష్టం, నా కృషి... ప్రమోషన్ విషయం తలపునకు వచ్చినప్పుడు ఉద్యోగాన్వేషణకోసం వరంగల్ నుండి హైద్రాబాద్‌కు నేను చేసిన ప్రయాణంలో చోటుచేసుకున్న ఒక సంఘటన నా కళ్ళముందు కదలాడుతుంది...

అయిదు సంవత్సరాల కిందట వరంగల్‌లో ఉండేవాళ్ళం మేము. అక్కడ మా నాన్నగారు చార్టెడ్ అక్కౌంటెంట్‌గా పనిచేసేవారు. అప్పుడు హైదరాబాద్‌లో ఉన్న కార్పొరేట్ ఆఫీసులో ఉద్యోగానికి నేను దరఖాస్తు పెట్టడం, ఇంటర్వ్యూకు హాజరుకమ్మని కాల్‌లెటర్ రావటం జరిగాయి. హైదరాబాద్ ఇంటర్వ్యూకి ఒంటరిగా వెళ్ళటానికెందుకో నా మనస్సు అంగీకరించలేదు. తోడుగా రాటానికి మా నాన్నగారికి వీలు పడలేదు. ఉద్యోగం అయినా వదులుకుంటాను కాని ఒంటరిగా హైదరాబాద్ వెళ్ళనని భీష్మించుకు కూర్చున్నాను.

- తప్పమ్మా, అలా భయపడి వచ్చిన అవకాశాన్ని విడిచిపెట్టుకోకూడదు. ఆడపిల్లలు మగాళ్ళకు దేనిలోను తీసుపోలేదు. అవకాశం రాగానే అమెరికా ఉద్యోగానికి కూడా ఒంటరిగా పరుగులు పెడుతున్నారు ఎందరో స్త్రీలు. వరంగల్ నుండి హైదరాబాద్‌కు మహాఅయితే మూడు లేక మూడున్నర గంటల ప్రయాణం. వరంగల్లో సాయంత్రం మూడున్నర గంటలకు బస్సు ఎక్కితే ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏడుగంటల లోపున సికింద్రాబాద్ చేరుకోవచ్చు. అక్కడ బస్టాండ్‌లో ఆటో పట్టుకుంటే నలభై నిముషాల్లో మౌలాలి హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న మీ పిన్నిగారింటికి చేరుకోవచ్చు. - నాన్నగారు చిలుకకు చెప్పినట్టు చెప్పారు. నేను కాదనలేకపోయాను.

మధ్యాహ్నం మూడున్నర గంటలకు బయల్దేరాను నేను. హైదరాబాద్‌కు మరో ఇరవై నిముషాల్లో చేరుకోబోయేముందు మా బస్సు టైరు పంక్చరైంది. బస్సు అక్కడనుండి మళ్ళీ బయల్దేరేసరికి టైము ఎనిమిది దాటింది.

సికింద్రాబాద్‌లో బస్సు దిగాక ఆటోకోసం నిలబడ్డాను. ఆకాశంలో మేఘాలు దొర్లుకుంటూ రాసాగాయి. చిన్న జల్లుతో ప్రారంభమైంది వర్షం. నన్ను దాటుకుని ఆటోలు ఒకదాని వెంట మరొకటి వెళ్తున్నాయి. కాని ఒక్కటీ ఆగలేదు. టైం తొమ్మిది కావస్తోంది. అదృష్టవశాత్తు మౌలాలి వైపు వెళ్లే సిటీ బస్సు నాముందు ఆగింది. ఆటోకోసం మరోక్షణం ఆగకుండా వెంటనే బస్సెక్కి కూర్చున్నా. నాకు ముందున్న సీట్లో కూర్చున్న వ్యక్తికి పాతికేళ్ళు కూడా ఉండకపోవచ్చు. నలిగిన దుస్తులతో ఉన్న అతని మొహంలో కళాకాంతులు లేవు.

ఒంటరి ప్రయాణం, చీకటి రాత్రి. ఆకాశంలో ఉరుములు, మెరుపులు. మా పిన్నిగారింటికి చేరుకోకముందే వర్షం ముంచుకొస్తుందన్న భయం. నేను వస్తున్నట్టు పిన్నిగారికి నాన్న ఫోన్ చేశారో లేదో నాన్న ఆందోళన.

మనసు స్థిమితంగా లేదు. సర్టిఫికేట్లు, కాల్‌లెటర్లలో ఉన్న ఫైలు నా చేతిలో ఉంది. సీటు పక్కన పెట్టిన బ్యాగ్‌లో ఖర్చులకని నాన్నగారిచ్చిన పైకముంది. ఎరుపు రంగులో ఉన్న ఆ చిన్న హేండ్‌బ్యాగ్ బస్సులో ఉన్న లైట్ల వెలుగులో కొట్టొచ్చినట్టు కనబడుతోంది. ఒంటరిగా ఎదుటి సీట్లో కూర్చున్న మనిషి దృష్టి ఆ హేండ్ బ్యాగ్‌మీద పడిందేమో మరి, రెప్పవేయకుండా చూస్తున్నాడు.

ఈదురుగాలి బస్సులోకి ప్రవేశించింది. వాన తుంపర్లు పడి తడుస్తుందేమోనని చేతిలో ఉన్న ఫైలును వీపువెనుక పెట్టి సీట్లో కూర్చున్నాను. గాలి విజృంభించింది. ఎలా పడిందో ఫైలు నేను పెట్టిన చోట లేదు. సీటు కింద పడి ఉంది. అదే క్షణాన నేను దిగాల్సిన స్టేజ్‌లో బస్సు ఆగటం, నేను లేచి నిలబడి ఫైలుని, బ్యాగ్‌ని పుచ్చుకుని బస్సు నుండి కిందకు దిగటం వెంటవెంటనే జరిగాయి. రోడ్డు క్రాస్ చేసి నేను మా పిన్నిగారు ఉంటున్న కాలనీ దారిపట్టాను. చిన్న జల్లు పడుతోంది. రోడ్డు గుంతల్లో చోటుచేసుకున్న బురద నీళ్ళు చూసుకుంటూ మెల్లగా నడక సాగించాను. అలా వెళ్తూ వెనక్కి తిరిగి చూశాను. బస్సులో నా ఎదుట కూర్చున్న వ్యక్తి పరుగెత్తుకుంటూ నావైపే రావటం నా కంట పడింది. నేను ఊహించినట్టే ఏదో దురుద్దేశంతో అతను నావెంట పడ్డాడు. అతని దృష్టి నుండి తప్పించుకోవాలన్న ఉద్దేశంతో చీకట్లో నడక వేగాన్ని పెంచి ముందుకు దూసుకుపోయాను.

ఆ తర్వాత రెండు నిముషాలకు నేను పిన్నిగారింటికి చేరుకోగలిగాను.

'శారదా! వచ్చావా తల్లీ... నీ రాకకోసం సాయంత్రం ఆరుగంటల నుండి ఎదురు చూస్తున్నాము. ఇంత ఆలస్యమైందేమిటి?- ప్రయాణం సుఖంగా జరిగిందా??' బాబాయి ప్రశ్నల వర్షం కురిపించారు. ఆయన ధోరణి పిన్నికి నచ్చలేదు.

'మీ ప్రశ్నలు ఆపండి, అమ్మాయి ఎప్పుడు బయల్దేరిందో... పాపం ఆకలితో ఉందోఏమో- ముందు లోపలికెళ్ళి కాళ్ళు, చేతులు కడుక్కుని రానీయండి.' బాబాయి మాటలకు అడ్డుతగిలింది పిన్ని. చేతిలోని ఫైలును, హేండ్‌బ్యాగ్‌ని టేబుల్ మీద పెట్టి బాత్‌రూమ్‌లోకి వెళ్ళబోయాను నేను...

'సార్! ఇది శ్రీరామశర్మగారిల్లేనా అండీ- ఇప్పుడొక అమ్మాయిగారు ఇక్కడకు వచ్చారా సార్!' వీధి గుమ్మం దగ్గర నిలబడి ఎవరో అడుగుతున్నారు. అతని మాటలు నా చెవిని పడగానే నా కాళ్ళు ముందుకు పోలేదు. వెనక్కి తిరిగి బాబాయి దగ్గరకెళ్ళాను. హాల్లో ఆయన తలుపుపక్కన నిలబడి ఉన్నారు. వాకిట్లో ఉన్న వ్యక్తిపై నా దృష్టిపడింది. అతన్ని చూసి మ్రాన్పడిపోయాను ఒక క్షణం.

'మా శారద గురించా నువ్వడిగేది!... ఆమె ఇప్పుడే వచ్చింది. ఇంతకీ నువ్వెవరు? ఆమెతో నీకేం పని?' అడిగారు బాబాయి, వాకిట్లో అడుగుపెడుతూ.

తలుపు పక్కనే నిలబడి ఉన్న నేను సూటిగా చూశాను. ఆ వ్యక్తి చేతిలో ఏవో కాగితాలున్నాయి.

'పది నిముషాల క్రితం అమ్మాయిగారు బస్సు దిగారు. బస్సు దిగుతున్నప్పుడు ఆమె ఫైల్‌నుండి రెండు కాగితాలు జారి కూర్చున్న ఆమె సీటుకింద పడ్డాయి. వాటిని పుచ్చుకుని ఆమెకు అందించాలని బస్సు దిగాను. బస్సు కదిలిపోయింది. చీకట్లో అమ్మాయిగారు కనబడలేదు. వర్షంలో తడుస్తూ వెళ్ళి ఎదుట కనిపించే వీధిలో మొదటి ఇంటికెళ్ళి తలుపు తట్టాను. వయసు మళ్ళిన పెద్దాయన తలుపు తెరిచారు. నేనిచ్చిన కాగితాలు చూశారు. దానిలో ఒక కాగితం వెనుక పెన్సిల్‌తో రాసి ఉన్న, ఇక్కడ కాలనీ అడ్రసు చదివి చెప్పారు. ఆయన చెప్పిన ఇంటి నెంబరు గుర్తుపెట్టుకుని ఇక్కడకొచ్చాను! చేతిలోని కాగితాలు బాబాయికిచ్చి అతను బాబాయి ఎదుట నిలబడ్డాడు.

'అవును, ఇవి మా శారదకు చెందిన కాగితాలే... వీటిలో ఒకటి రేపటి ఇంటర్వ్యూకు సంబంధించిన కాల్ లెటర్.' కాగితాలు చూస్తూ అన్నారు బాబాయి.

బస్సులో నా ఎదుట కూర్చున్న ఆ మనిషిని అపార్థం చేసుకున్నందుకు సిగ్గుతో తల దించుకున్నాను నేను. వేష భాషలనుబట్టి మనిషి మంచి చెడ్డలను అంచనా వేయకూడదన్న నిజాన్ని ఆరోజు నేను గ్రహించాను. కాగితాలు చదివి బాబాయి చెప్పేవరకు బస్సులో ఫైల్ నుండి కాగితాలు జారిపడినట్టు నేను గమనించలేదు. నా హేండ్‌బ్యాగ్ నుండి అయిదువందల నోటు ఒకటి తీసి వర్షంలో తడుచుకుంటూ వచ్చిన ఆ వ్యక్తి చేతిలో పెట్టబోయాను. కాని అతను తీసుకోలేదు.

'డబ్బుకోసం కాగితాల్ని తీసుకురాలేదు మేడమ్. ఆ కాగితాల్లో ఏముందో నాకు తెలీదు. నేను చదువుకోలేదు. చదువుకున్న వారంటే నాకు చాలా గౌరవం. వారు ఏవైనా మంచిమాటలు చెబితే విని ఆనందించాలన్న కోరిక. అందుకే రైల్లోగాని, బస్సులో గాని చదువుకునేవారి పక్కన కూర్చోటానికి ప్రయత్నిస్తుంటాను. అక్షర జ్ఞానం లేనందుకు నేను బాధపడని రోజు లేదు' చెప్పాడు అతను.

'నీ పేరేమిటి బాబూ!' అడిగారు బాబాయి.

'నా పేరు శివయ్య' అతను చెప్పాడు.

'నిలబడే మాట్లాడుతున్నావ్- అలా కూర్చో శివయ్యా!' అన్నారు బాబాయి.



'చూడు శివయ్యా- ఈరోజుల్లో ప్రతి ఉద్యోగానికి చదువుకోవాలి. అక్షర జ్ఞానం ఉండాలి. చిన్నప్పుడు చదువుకోలేదని బాధపడి కూర్చోడం మంచి పద్ధతి కాదు. ఇప్పుడు వయోజన విద్యా కేంద్రాలున్నాయి. పగలు కష్టపడి పనిచేసుకోవచ్చు. రాత్రి బడిలో పాఠాలు నేర్చుకోవచ్చు. కాబట్టి శివయ్య, వెంటనే నువ్వు ఏదైనా రాత్రిబడిలో చేరి బాగా చదువు.

వాకిట్లో గోడను ఆనుకొనున్న అరుగుమీద కూర్చున్నాడు శివయ్య. గోడ పక్కనున్న స్టూలును ముందుకు లాగి, దానిమీద కూర్చున్నారు బాబాయి.

మేఘాలు చెదిరిపోయాయి. వర్షం తెరిపిచ్చింది.

'నువ్వెక్కడ పనిచేస్తున్నావ్ శివయ్యా!' బాబాయి అడిగారు.

'అదేటి బాబూ అలా అడిగేరు... చదువులేనోడికి ఉజ్జోగం ఎవరిస్తారయ్యా...'అన్నాడు శివయ్య.

'అది నిజమే- మరి నువ్వెందుకు చదువుకోలేదు శివయ్యా.'

'అయ్యా, అమ్మా నా చిన్నప్పుడే కాలం చేశారయ్యా. మా నాయనమ్మ దగ్గర నేను పెరిగాను. నన్ను ఎవరూ బడికి పంపలేదయ్యా.'

'చూడు శివయ్యా- ఈరోజుల్లో ప్రతి ఉద్యోగానికి చదువుకోవాలి. అక్షర జ్ఞానం ఉండాలి. చిన్నప్పుడు చదువుకోలేదని బాధపడి కూర్చోడం మంచి పద్ధతి కాదు. ఇప్పుడు వయోజన విద్యా కేంద్రాలున్నాయి. పగలు కష్టపడి పనిచేసుకోవచ్చు. రాత్రి బడిలో పాఠాలు నేర్చుకోవచ్చు. కాబట్టి శివయ్య, వెంటనే నువ్వు ఏదైనా రాత్రిబడిలో చేరి బాగా చదువు. పట్టుదలతో చదివితే మూడునాలుగేళ్ళలో ఎలాంటి ఇబ్బంది లేకుండా పుస్తకాలు చదివే జ్ఞానం నీకు కలుగుతుంది. మా శారద పోగొట్టుకున్న కాగితాలు తెచ్చి నువ్వు మాకు చాలా సహాయం చేశావు. నీ మేలు మేము ఎన్నటికి మరచిపోలేము- అది సరే, ఈ రాత్రి ఇక్కడ ఉండి మాతోబాటు భోజనం చేసి నువ్వు రేపు వెళితే మాకు తృప్తిగా ఉంటుంది' అన్నారు బాబాయి.

'లేదయ్యా! వెంటనే ఇంటికెళ్ళాలి. నాయనమ్మ తిండి తినకుండా నాకోసం చూస్తూ ఉంటాది.' చెప్పాడు శివయ్య.

'అలా అయితే నేను అడ్డు చెప్పను. వెళ్ళిరా శివయ్యా!'

శివయ్య బయల్దేరాడు. అతని వెంట ఇంటి గేటువరకు వెళ్ళారు బాబాయి.

⁂

బస్సులో పోగొట్టుకున్న సర్టిఫికేట్, కాల్‌లెటర్ ఆరోజు శివయ్య తెచ్చి ఇవ్వకపోతే ఈరోజు నేను యీ బ్రాంచి మేనేజర్ కుర్చీలో కూర్చుండకపోదును...

టేబుల్ మీదున్న ఫోన్ రింగ్ అవటంతో గత స్మృతులనుండి వర్తమానంలోకి వచ్చాను నేను. సెక్రటరీ చెప్పిన ప్రోగ్రామ్ ప్రకారం పన్నెండు గంటలకు సెక్యూరిటీ గార్డుల రిక్రూట్‌మెంట్‌కోసం మెయిన్ హాల్లోకెళ్ళి కూర్చున్నాను. రెండు పోస్టులకోసం రిటెన్ టెస్ట్‌లో పాసయిన పన్నెండు మంది అభ్యర్థులు హాలు పక్కనున్న వరండాలో కూర్చుని ఉన్నారు. వ్రాత పరీక్షలో ఉత్తీర్ణులైన ఆ పన్నెండు మంది అభ్యర్థులలో శివయ్యకే ఎక్కువ మార్కులు వచ్చాయి. అతని ఆన్సర్ పేపర్ తెప్పించి చదివాను. అక్షరాస్యత, దాని ఆవశ్యకత గురించి శివయ్య చాలా చక్కగా రాశాడు. ఇంటర్వ్యూలో కూడా మొదటి మార్కు శివయ్యే దక్కించుకోటం నాకు చాలా సంతోషాన్ని కలిగించింది. తర్వాత, సెలెక్టయిన ఇద్దరు అభ్యర్థులను నా ఎదుట ప్రవేశపెట్టారు.

'శివయ్యా! నువ్వు సెలెక్టయ్యావు. నాకు చాలా ఆనందంగా ఉంది. ఇందులో నీకు నేను చేసిన సహాయం ఏమీ లేదు. పేపర్ బాగా రాశావు, సెలెక్ట్ అయ్యావు' అన్నాను నేను.

'ఇందులో నా ప్రత్యేకత ఏమీలేదు మేడమ్, నా విజయానికి కారణం మీ బాబాయిగారి ఆశీర్వాదం, మిమ్మల్ని మొదటిసారి కలుసుకున్న వేళా విశేషం. వర్షం కురిసిన ఆ రాత్రి మీ బాబాయిగార్ని కలిసి ఉండకపోతే ఆ తర్వాత రాత్రిబడిలో నేను చేరటం, ఈరోజు ఇంటర్వ్యూలో నేను సెలెక్టవడం జరిగి ఉండేవి కావు' చెప్పాడు శివయ్య.

'ఆర్డర్స్ టైప్‌చేసి శివయ్యకివ్వండి, శివయ్య రేపే డ్యూటీలో చేరుతాడు. అలాగే రెండో అభ్యర్థి ఆర్డర్లు కూడా టైప్‌చేసి తీసుకురండి' పక్కన నిలబడి ఉన్న అసిస్టెంట్‌కి ఫైల్ ఇచ్చాను.

ఆనందంతో చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకుంటూ అసిస్టెంట్ వెంట ఆఫీస్ రూమ్‌లోకి వెళ్ళాడు శివయ్య.

★